andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.6 : కనిష్ఠం 30.5
కామారెడ్డి జిల్లా వార్తలు
1
శుక్రవారం 26 ఏప్రిల్ 2024



ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

రామారెడ్డి, ఏప్రిల్ 25: మండలంలోని మద్దికుంట, అన్నారం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను గురువారం మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షానికి తడి సిన ధాన్యాన్ని తేమ శాతం 17లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు తెలిపారు. అకాల వర్షాలు పడే సూచనలు ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి ఉంచాలని తెలిపారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి.. వలసల జోరు!







కామారెడ్డి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోంది. ప్రత్యర్థులను బలహీనపరచడంతో పాటు తమ బలాన్ని పెంచుకోవడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్న కాంగ్రెస్ వలసలపై దృష్టి సారించింది. ఎన్నో సంవత్సరాలుగా వివిధ కారణాలతో పార్టీని వీడి వెళ్లిన నేతలు తిరిగి సొంతగూటికి చేరేలా చర్యలు చేపట్టింది. దీంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని పాతనేతలు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల ఎమ్మెల్సీ రాజేశ్వర్ కాంగ్రెస్ గూటికి చేరగా తాజాగా ఎల్లారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కామారెడ్డిలోనూ పలువురు కౌన్సిలర్‌లు, జడ్పీటీసీలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇదే బాటలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు చేరికలకు ద్వారాలు తెరిచారు. దీంతో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో వలసలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ముఖ్యనేతలు మామిండ్ల ఆంజయ్య, హరికిషన్ గౌడ్, నిమ్మ మోహన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీబీపేట మండలానికి చెందిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు, నాయకులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిపోయారు. మాచారెడ్డి మండలానికి చెందిన పలువురు నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల సమయంలో, కాంగ్రెస అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండలాలు, పట్టణాల్లో ముఖ్యనేతలు బీఆర్ఎస్‌ను వీడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్నారు.

- వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్, బీజేపీని వీడి నేతలు కాంగ్రెస్‌లోకి
- గతంలో పార్టీని వీడి వెళ్లిన వారిపై కాంగ్రెస్ ఫోకస్
- ఇప్పటికీ సొంతగూటికి చేరిన పలువురు నేతలు
- అదేబాటలో మరికొందరు నాయకులు
- కామారెడ్డి మున్సిపల్‌లో ఖాళీ అయిన బీఆర్ఎస్
- ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై గురిపెట్టిన కాంగ్రెస్
- పోచారం ఇలాకాలోనూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ గూటికి

ఎల్లారెడ్డి మున్సిపల్‌పై గురి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. మూడ్రోజుల క్రితం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం మంత్రి రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే మిగితా కౌన్సిలర్‌లు చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. చైర్మన్ కాంగ్రెస్‌లో చేరడంతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యే పావులు కదుపుతున్నట్లు అనుచరులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బల్దియాలోని మిగిలిన కౌన్సిలర్‌లతో ఎమ్మెల్యే టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అయితే ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనూ పలువురు బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. రెండ్రోజుల క్రితం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో అసంతృప్తితో బీజేపీలో చేరి ఆ పార్టీ తరపున సుభాష్‌రెడ్డి పోటీ చేశారు. అదే సమయంలో ఎంపీ టికెట్ ఇస్తామని సుభాష్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు హామీ ఇచ్చినప్పటికీ టికెట్ రాకపోవడంతో ఆయన కొన్ని రోజులుగా అసంతృప్తితో ఉన్నారు. చివరికి సుభాష్‌రెడ్డి సొంత గూటికి చేరారు.

పోచారం ఇలాకాలో కాంగ్రెస్‌లోకి వలసలు

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కంచుకోటగా ఉన్న బాన్సువాడలోనూ కాంగ్రెస్‌లోకి వలసలు ఆగడం లేదు. బాన్సువాడ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు, పోచారం అనుచరులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు హస్తం పార్టీలోకి వస్తున్నారు. ఇటీవల బీర్కూర్ జడ్పీటీసీ స్వరూప, బాన్సువాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణ, దుర్కి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ కిషోర్‌యాదవ్‌తో పాటు పోచారం అనుచరులు పలువురు ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలుపొందారు. కానీ ఆ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన చాలా మంది పార్టీని వీడుతున్నట్లు తెలుస్తోంది.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటు నమోదు దరఖాస్తుల
విచారణను వేగంగా పూర్తి చేయాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25: ఓటు నమోదు దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఓటర్ల తుది జాబితాలో తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటేసేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వేసవికాలం ఉన్నందున టెంట్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు వడదెబ్బకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని తెలిపారు. ఓటింగ్ లైన్ల వద్ద నీడ వసతి కల్పించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం సిద్ధం చేయాలని తెలిపారు. ఈనెల 26న ఎన్నికల సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈనెల 29న ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్, ఏవో మసూర్‌అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు జ్యోతి, సరళ, ఉమలత, స్వప్న, ఇందిరా ప్రియదర్శిని, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్య ప్రతిష్ఠతకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం స్వీప్ ఆధ్వర్యంలో పట్టణ మహిళ సమాఖ్య సభ్యులతో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సరాసరి 80 శాతం ఓటు నమోదు కాగా పట్టణ ప్రాంతాల్లో కేవలం 60 శాతం మాత్రమే నమోదవుతుందని తెలిపారు. వంద శాతం ఓటింగ్ నమోదయితే ఫలితాలను ప్రభావితం చేస్తాయని, కాబట్టి పట్టణంలోని 1547 మహిళ సమాఖ్య సంఘాలు 16వేల మంది సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం తేవాలన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో సరైన అభ్యర్థిని ఎన్నుకోవడం ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేసినవారవుతామని తెలిపారు. ప్రతీ అభ్యర్థి వివరాలను భారత ఎన్నికల సంఘం పారదర్శకంగా తమ వైబ్‌సైట్‌లు పొందుపరుస్తుందని, ఓటర్లు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గేనా?



- అవిశ్వాస గ్రూపు నుంచి కాంగ్రెస్‌లోకి ఒకరు చేరిక
- గతంలో కూడా అవిశ్వాసంపై ప్రయత్నాలు
- శిబిరానికి సిద్ధమవుతున్న కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 25: ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. బుధవారం మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనికి నిరసనగా వెంటనే 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు తీర్మానాన్ని అందజేసిన విషయం తెలిసిందే. అయితే పది మంది కౌన్సిలర్లలో నుంచి ఒకరు బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మిగతా అవిశ్వాస తీర్మానం పెట్టిన వారిలో ఇంకా తొమ్మిది మంది మిగిలారు. అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా ఉండాలంటే మిగతా మరో ముగ్గురు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడానికి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు ఒక్కతాటిపై ఉండి పట్టుదలతో అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్మన్ పీఠాన్ని దించడానికి కౌన్సిలర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

గతంలో కూడా అవిశ్వాసం పెట్టడానికి ప్రయత్నాలు

గతంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ పనితీరుపై అసంతృప్తితో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడానికి శిబిరాలు సైతం ఏర్పాట్లు చేశారు. కాని ఏడాది క్రితం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ కౌన్సిలర్లతో చర్చలు జరిపి సయోధ్య కుదుర్చడంతో అవిశ్వాస ప్రయత్నాలను కౌన్సిలర్లు విరమించుకున్నారు. ఇటీవల ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గటంపై ఎల్లారెడ్డిలో కూడా అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తు న్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం పెట్టిన వారిలో ఒకరు చైర్మన్ పదవి ఆశిస్తూ కౌన్సిలర్ శిబిరానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది శిబిరానికి వెళ్లినట్లు సమాచారం. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా మున్సిపల్ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడానికి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

భగ్గుమంటున్న సూరీడు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25: కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలాల్లో సుర్యుడు భగ్గుమంటున్నాడు. ఆయా మండలాల్లో 41 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం బిచ్కుందలో 42.3 డిగ్రీలు, గాంధారి, రామారెడ్డి, డోంగ్లీ, నిజాంసాగర్ మండలం ముక్దుంపూర్, నస్రూల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవునిపల్లి, బీబీపేట, గాంధారి మండలం సర్వాపూర్‌లో, రాజంపేట మండలం ఆర్గొండలో, పిట్లం ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక పెద్ద కొడపగల్, పాల్వంచ మండలం ఎల్పుగొండ, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి, లింగంపేట, మద్నూర్ మండలం మేనూర్, నాగిరెడ్డిపేట, మాచారెడ్డి మండలం లచ్చపేట, బాన్సువాడ మండలం కోల్లూర్, బిచ్కుంద మండలం పుల్కల్, బీర్కూర్ మండలాల్లో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

చేప పిల్లల కేంద్రం.. ఎత్తివేత!?



మట్టి కుంటలు

- ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు?
- కళాహీనంగా మారిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం
- ప్రభుత్వాలు, పాలకులు మారినా ఫలితం శూన్యం
- ఇది నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం దుస్థితి

నిజాంసాగర్, ఏప్రిల్ 25: నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఎత్తివేతకు అధికార యంత్రాంగం సన్నాహాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహిస్తారో తెలియదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా మారింది. ఆనాడు మత్స్య కార్మికుల ఉద్ధరణకు ప్రభుత్వం 11 ఎకరాల స్థలంలో చిరు చేప పిల్లల ఉత్పత్తితో పాటు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సంఘం 1990లోనే ఎత్తివేశారు. సంఘం నిర్వహణలో భాగంగా పని చేసే జనరల్ మేనేజర్‌తో పాటు సిబ్బందిని ఇతరత్రా శాఖలో విలీనం చేశారు. సంఘ భవనాలు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. 1956లో ఇదే ఆవరణలో దాదాపు 3 కోట్ల 50 లక్షల చిరు చేప పిల్లల ఉత్పత్తి చేసేందుకు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం రాష్ట్ర రాజధానిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. అప్పటి తెలంగాణ జిల్లాల్లో మొట్ట మొదటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిజాంసాగర్‌దేనని చెప్పవచ్చు. 1956 నుంచి 1995 వరకు ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో లక్ష్యాన్ని మించి చేప పిల్లలను ఉత్పత్తి చేసే వారు. కాల క్రమేణా ఉత్పత్తి కేంద్రంలో ఉన్న నర్సరీలు, కచ్చా పాంట్స్, మట్టి చెరువులు కళాహీనంగా మారడమే కాకుండా సిమెంట్ నర్సరీలు శిథిలావస్థకు చేరి అవి పనికిరాకుండా పోయాయి. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై నిర్లక్ష్య వైఖరి అవలంభించడంతో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా కేంద్రం ఆనవాళ్లు, రూపురేఖలు లేకుండా పోయాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమై రెండు పర్యాయాలు ప్రభుత్వం చేపట్టింది. మాజీ మంత్రి, మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారు. కానీ మత్స్యశాఖ అధికార యంత్రాంగం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిక పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో పూర్వ వైభవం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధికారులతో పాటు సిబ్బందిని కూడా పోచంపాడ్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై బదిలీలు చేశారు. సిబ్బంది లేని కారణంగా చిరు చేప పిల్లల ఉత్పత్తికి నోచుకోవడం లేదా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఎత్తి వేసేందుకు సన్నాహాలు జరుపుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దాదాపు 11 ఎకరాల్లో కార్యాలయ భవనాలు, మత్స్యశాఖ భవనాలు, గిడ్డంగులు ఇప్పటికే కూలే దశకు చేరుకున్నాయి. ఈ కేంద్రాన్ని ప్రజా ప్రతినిధులు పట్టించుకునే పాపాన పోవడం లేదని మత్స్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2014 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి అప్పటి ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేప పిల్లలను రిజర్వాయర్‌తో పాటు చెరువుల్లో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి విడుదల చేస్తున్నారు. నీటి వసతి కలిగిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి మరమ్మతులు చేసి ఇక్కడే చేప పిల్లల ఉత్పత్తి చేయాల నే ఆలోచన అధికార యంత్రాంగానికి లేకుండా పోయింది. జిల్లాలో కోటి 80లక్షల చేప పిల్లలను ప్రతీ వర్షాకాలంలో నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు చిన్న నీటి వనరులైన కౌలాస్, సింగీతం, నీటి వనరులతో పాటు జిల్లాలోని 570 చెరువుల్లో కూడా చేప పిల్లలను విడుదల చేస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేసినా అధికారంలోకి రాలేక పోయింది. ప్రస్తుత ప్రభుత్వం చేప పిల్లల కేంద్రాన్ని ఎత్తి వేసేందుకు సన్నాహాలు జరుపుతున్నట్లు విశ్వ సనీయ సమాచారం. దాదాపు 11 ఎకరాల స్థలంలో సిమెంట్ నర్సరీ లతో పాటు మట్టి నర్సరీలు, చెరువులను అప్పట్లో లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టి లక్ష్యానికి మించి చేప పిల్లల ఉత్పత్తి చేశారే తప్ప ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ ఈ ఉత్పత్తి కేంద్రంపై సవతి ప్రేమ చూపడం గమనార్హం. వచ్చే వర్షాకాలం నాటికి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మరమ్మతులు చేస్తారా, ఎత్తివేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజక వర్గాల మత్స్య కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వైభవం తెస్తుందా.. ఎత్తివేస్తారా అనేది ప్రశ్నార్థకమే.



సిమెంట్ నర్సరీ



శిథిలావస్థకు చేరిన కార్యాలయం

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- జహీరాబాద్ పార్లమెంట్‌కు 25 నామినేషన్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18న మొదలైన నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. వారం రోజుల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 25 మంది అభ్యర్థులు, నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి అందజేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ ఉన్నారు. అలాగే కొత్త బలిజ బస్వరాజ్ (తెలంగాణ ప్రజాశక్తి), ఎం.మోహన్‌రెడ్డి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రోమాల బాబు దుర్గయ్య (ఇండియా ప్రజాబంధు), చావగాని మణి (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), దేవ శిఖామణి (ధర్మ సమాజ్ పార్టీ), మున్వర్ హుస్సేన్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ), బి.బాలరాజు (బీఎస్పీ)తో పాటు ఇండిపెండెంట్‌లుగా ప్రవీణ్ కుమార్, బి.మారుతిరావు, రామారావు పాటిల్, గంగారాం, రమేష్ సజ్జాపూర్, రవి మహాదేవ స్వామి, తలారి అశోక్, జైపాల్ నాయక్, గొల్లపల్లి మాణయ్య, కే.ఆనందీశ్వర్, యాకూబ్ షరీఫ్, మోహద్ సద్దాం, రామకృష్ణ దాస్, కిరణ్ రాథోడ్, ముక్కె సారికలు నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.



ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి సారిక

ఆర్మూర్‌లో ఓటుహక్కుపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 25: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌లలో స్వీప్ నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ఎస్ఎల్ఎఫ్ సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. మామిడిపల్లిలోని పాత గ్రామపంచాయతీ భవనం, పెర్కిట్‌లోని మహిళ భవనంలో ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా మహిళలందరూ కుటుంబసభ్యులు ఓటు వేయడమేకాకుండా చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులను ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ సభ్యులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, టీఎంసీ ఉదయశ్రీ, సీసీ రాజలింగం, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

సీఎంకు ఓటునోటు కేసు భయం మొదలైంది

● బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్

పెద్దబజార్, ఏప్రిల్25: సీఎం రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసు భయం మొదలైందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి స్పీచ్‌లలో మానసిక ఒత్తిడి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు తీసివేసి ఎస్సీ ఎస్టీలకు ఇస్తామని అన్నారు. బీజేపీపై చార్జీషీట్లు వేసేస్థాయి రేవంత్‌రెడ్డికి లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్25: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలంటే ప్రజల పక్షాన గొంతుకై ప్రశ్నించే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం ముప్కాల్ మండలంలోని నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

రుద్రూరులో పడకేసిన పారిశుధ్యం

● డ్రైనేజీలు, మురికి కాలువల్లో చెత్తాచెదారం ● రోడ్లపై చెత్తాచెదారం ● పట్టించుకోని అధికారులు

రుద్రూరు, ఏప్రిల్ 25 : రుద్రూరు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. కనీసం పక్షం రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సిన డ్రైనేజీలు, మురికి నీటి కాలువలను అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడికక్కడే నిండిపోతున్నాయి. దీంతో గ్రామాలు దుర్గంధ భరితమవుతు న్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సిబ్బంది కనీస సౌకర్యాలను కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.రుద్రూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో చెత్తాచెదారం పూర్తిగా నిండిపోయింది. మురికి కాలువల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. అసలే మండుతున్న ఎండలు.. ఆపై ఉక్కపోత.. చీకడి పండిందంటే చాలు దోమలు తీవ్రత మరింత ఎక్కువ అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్, జవహర్‌నగర్ తదితర కాలనీలలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ, మురికి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు పేర్కొటున్నారు. రుద్రూరులోని 1, 4, 5, 12వ వార్డులతో పాటు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ, మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం వలన దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని



రుద్రూరులో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంగడి బజార్ ప్రాంతంలో జనావాసాల మధ్య డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీలో మురుగు, చెత్తాచెదారంతో విపరీతంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. డ్రైనేజీ, మురికి కాలువలకు ఇరువైపుల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయి. డ్రైనేజీ, మురికి కాలువల్లో స్ప్రేమందులను పిచికారి చేయాలని కోరుతున్నారు. ప్రజలు మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర రోగాల బారిన పడే అకాశ ముందన్నారు.గ్రామ పంచాయితీ అధికారులు అక్కడక్కడ నామమాత్రంగా డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ డ్రైనేజీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలోనే ఉండటం గమనార్హం. ఎన్నోమార్లు గ్రామ పంచాయితీలలో సమస్య గురించి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక వాసులు పేర్కొంటున్నారు. అదే విధంగా ప్రధాన రోడ్లపై చెత్త చెదారాన్ని తొలగించడంలో అధికారులు శ్రద్ధచూపడం లేదు. పన్నులను వసూలు చేయడంతో చూపించే శ్రద్ధను గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపైప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

●డ్రైనేజీ సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలి

రుద్రూరులోని జవహర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సైడ్‌వాల్ కూలిపోయింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

డ్రైనేజీలలోని చెత్తాచెదారాన్ని తొలగించాలి



డ్రైనేజీలలో చెత్తచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది.ఎన్నిమార్లు గ్రామ పంచాయ తీలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని డ్రైనేజీలను శుభ్రం చేయాలి.

- మహ్మద్ అబ్రార్ ఖాద్రి, స్థానికుడు, రుద్రూరు

సమస్యలను పరిష్కరిస్తాం

ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో చూసి మురికి కాలువలు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

- గంగాధర్, పంచాయితీ సెక్రటరీ, రుద్రూరు

వృద్ధులపై దాడి నిందితులను పట్టుకుంటాం

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



శేషాద్రిఫారంలో విచారణ జరుపుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

కోటగిరి,ఏప్రిల్25: ఒంటరిగా ఉన్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసి వారి ఒంటిపై ఉన్న బంగారు నగలను అపహరించుకుపోయిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. పోతంగల్ మండలంలోని రంగనాయకులు ఫారం, శేషాద్రి ఫారం గ్రామాలలో వృద్ధులపై దాడి చేసిన ఇళ్లను గురువారం బోధన్ ఏసీపీ పరిశీలించారు. ఇంటి పరిసరాలను పరిశీలించడంతో పాటు స్థానికులను విచారించారు. రెండు రోజుల క్రితం రంగనాయకుల ఫారంలో భార్గవి దేవి అనే వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు నగలను అపహరించుకుపోయిన విషయం విదితమే. తీవ్రగాయాల పాలైన వృద్ధురాలు బోధన్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నెల రోజుల క్రితం శేషాద్రి ఫారం గ్రామంలోనూ ఇలాంటి ఘటననే చోటు చేసుకుంది. ఒంటరిగా ఉన్న రాధాకృష్ణమూర్తి అనే వృద్ధుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అకస్మారక స్థితిలో ఉన్న రాధాకృష్ణను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నెల రోజుల్లో వృద్ధులను టార్గెట్ చేస్తూ వరుస చోరీలను పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏసీపీ వెంట రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ తదితరులున్నారు.

ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

కోటగిరి,ఏప్రిల్25: గత పదేళ్లలలో ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేసిందని ఈ ఎన్నికలలో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికలలో బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డిల్లీ మద్యం వ్యాపారి ఎన్నికల బాండ్‌ల రూపంలో బీజేపీకి రూ.500కోట్లు చెల్లించారని గుర్తు చేశారు. గత 67ఏళ్లలలో 14మంది ప్రధాన మంత్రులు 55లక్షల కోట్ల అప్పులు చేసి ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మోడీ హయాంలో రూ.113కోట్ల లక్షల అప్పులు చేసి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేశారన్నారు. బీజేపీ ఎన్నికల సమయంలో ప్రతీ ఒక్కరికి రూ.15లక్షల ఖర్చు వేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాల హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. పదేళ్లలో దేశ సంపదను ఖర్చు చేసి విదేశీ యాత్రలు చేయడం తప్ప దేశానికి మోదీ చేసిందేమి లేదన్నారు. ఈ ఎన్నికలలో బీజేపీని ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు, మండల కార్యదర్శి విఠల్ గౌడ్, గంగాధర్, సాయిలు, మల్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజ్‌కుమార్

ముప్కాల్, ఏప్రిల్25: ముప్కాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఇందులో భాగంగా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆయాశాఖలకు చెందిన అధికారులు వారి వాణి వినిపించారు.ఈకార్యక్రమంలో ఎంపీఈవో మహమ్మద్, ముజాఫరోద్దిన్, ఎంపీడీవో భరత్‌చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో నిజామాబాద్ తరలివెళ్లిన బీజేపీ కార్యకర్తలు

నవీపేట,ఏప్రిల్25: మండల కేంద్రం నుండి నిజామాబాద్‌కు గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్ నామినేషన్ సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి, ఏప్రిల్25: నిజామాబాద్‌లో గురువారం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద నామినేషన్ వేసిన సందర్భంగా జక్రాన్‌పల్లి మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. మొదట జక్రాన్‌పల్లి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీపై నిజామాబాద్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకులు పోశన్న, రాజేందర్, రాజారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

పోతంగల్‌లో ఇంటింటికి బీజేపీ ప్రచారం

కోటగిరి,ఏప్రిల్25: పోతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బుధవారం బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ బీజేపీకే ఓటు వేయాలని కోరారు. దేశం ప్రగతి బాటలో పయనించాలంటే నరేంద్ర మోడీ మరోమారు ప్రధాని కావాల్సి ఉందన్నారు. బీబీపాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భజరంగ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయవార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 25: కమ్మర్‌పల్లి శ్రీగిరిగుట్ట పై కొలువుదీరిన గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదవ వార్షికోత్స వేడుకలు ఈ నెల 26 నుండి నేలాఖరువరకు నిర్వహింపబడతాయని ఆలయ అభివృద్ధి కమిటి, గ్రామ గౌడసంఘం, యువజన సంఘాల సభ్యులు తెలిపారు. ఈ నెల 26 న శుక్రవారం జోగెత్తుడు కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 27 న శనివారం అన్నదానం, 28 న ఆదివారం పోచమ్మ బోనాల ఊరేగింపు, 29 న సోమవారం గంగాకటమయ్య బోనాలుపట్టు, నందు కార్యక్రమాలు ఉంటాయని 30 న ఉదయం 7 గంటలకు ఎల్లమ్మ బోనాలు, ఆలయంలో ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహింపబడతాయని భక్తులు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొనాలని కోరారు. కాగా ఆలయంలో జరిగే వార్షికోత్సవం, పూజా, అన్నదాన కార్యక్రమాలకు భారీగా భక్తులు తరలివచ్చి దేవి కృపకు పాత్రులు కవాలని గౌడ కులసంఘ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు కోరారు.

ధర్మారం వాసికి ఎల్‌వోసీ అందజేత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: మండలంలోని ధర్మారం(బి)కి చెందిన డి.కృష్ణ అనారోగ్యం గురకావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి స్పందించి బాధితుడికి చికిత్స కోసం రూ.2.40 లక్షల ఎల్‌వోసీ అంద జేశారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

డొంకేశ్వర్ ఏప్రిల్ 25: అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్ నిమ్స్ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు రూ.2లక్షల ఎల్ వోసీ మంజూరైంది. ఆర్మూర్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్ కుమార్‌రెడ్డి మంజూరు చే యించిన రూ.2లక్షల ఎల్ వోసీ కాపీని గురువారం బాధితుడు గంగా ధర్‌కు అందజేశారు.



బాధితుడికి ఎల్‌వోసీ కాపీని అందజేస్తున్న దృశ్యం

బీఈడీ పరీక్షలకు 24మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 25: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు, గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు 412 మంది విద్యార్థులకు గాను 388 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 24 మంది గైర్హాజరయ్యారని, ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బీఎడ్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాల బాన్సువాడ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు.

'బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలి'

సిరికొండ ఏప్రిల్ 25 : మత రాజకీయాలను తన ఎజెండాగా ఎంచుకున్న నరేంద్రమోదీ మళ్లీ గెలిస్తే ప్రజాస్వామిక వాదులు, ప్రశ్నించే గొంతుకలను జైళ్ల పాలు చేస్తారని గురువారం సిరికొండలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మాస్‌లైన్, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు హాజరయ్యారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దాని మిత్ర పక్షాలను చిత్తు చిత్తుగా ఓడించాలని వ్యక్తలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ కమిటీ సభ్యులు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవీ, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ తదితరులు మాట్లాడారు.ప్రజావ్యతిరేక బీజేపీదాని మిత్ర పక్షాల పాసిస్టు విధానాలను తిప్పి కొట్టాలంటే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని అప్పుడే మన రాజ్యాంగాన్ని మనుధర్మ శాస్త్రం నుంచి కాపాడుకున్న వాళ్ల మవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొడ పీపీసీఎస్ అధ్యక్షుడు చెల్లెం గంగాధర్,బాబన్న,కాంగ్రెస్ నాయకులు దేగం సాయన్న, చందర్, బంగ్లా నర్సారెడ్డి,మాస్‌లైన్ నాయకులు రమేష్,దామోదర్, కేవీపీఎస్ అధ్యక్షుడు సుమన్, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేడే 1న సెలవు దినం ప్రకటించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: తెలంగాణ యూనివర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట గురువారం 138 వ మేడే పోస్టర్ లను సిబ్బంది ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బికోజీ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం పోరాడి ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్మిక హక్కులను సాధించుకోవడం జరిగిందని, హక్కుల పోరాటంలో చికాగో కార్మికులు తమప్రాణాలను అర్పించారని నేడు పాలకులు హక్కులను కాలరాస్తు కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొస్తున్నారని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని శ్రమ దోపిడి జరుగుతుందని, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. మేడే 1 వతేదిన సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది మధులిక, సుధీర్, రవీందర్ నాయక్, రమేశ్, గంగాధర్, జమున, రాణి, పాల్గొన్నారు.

నేడు జక్రాన్‌పల్లిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్24: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ 15వ వేడుక సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీవో రవి తెలిపారు. గత ఏడాదిలో అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఇప్పటికే గ్రామాలలో గ్రామస్థాయి సామాజిక తనిఖీలు ప్రజా వేదికలు నిర్వహించామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ సామాజిక ప్రజా వేదిక నిర్వహిస్తున్నా మని ఈ కార్యక్రమానికి అధికారులు హాజరవుతారని అన్నారు. అన్ని గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, మెట్లు,ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని కోరారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ధర్పల్లి, ఏప్రిల్ 25:మండలంలోని దుబ్బాక గ్రామంలో ఓ యువకుడు మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధర్ (25) అనే యువకుడు ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన తెలిపారు. రోజు కూలీ చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం సేవించేవాడని కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని ఎన్నిసార్లు చెప్పిన మృతుడిలో మార్పు రాలేదని ఎస్సై తెలిపారు. దీంతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

ధర్పల్లి, ఏప్రిల్ 25: మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఒకరు గొడ్డలితో దాడి చేసి గాయపర్చినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోపి అదే గ్రామానికి చెందిన సుగుణ కుటుంబాల మధ్య గతంలో భూమి వివాదాలు నెలకొన్నాయి. సుగుణ పేరుమీద గల భూమి తనకే చెందుతుందని గతంలో గోపి సుగుణ కుటుంబీకులపై దాడి చేసినట్లు ఎస్సై చెప్పారు. రెండు కుటుంబాల మధ్య భూవివాదంపైనే దాడికి దారి తీసిందన్నారు. ఇందులో భాగంగా గోపి, సుగుణ కుటుంబం వల్లేతనకు ఆస్తినష్టం జరిగిందంటూ గ్రామంలో గోడ ప్రతులను అతికించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గోడ ప్రతులపై గోపిని ప్రశ్నించగా గోపి గొడ్డలితో సుగుణ, కూతురు, కొడుకుపై దాడికి యత్నించడంతో అడ్డుగా వెళ్లిన సుగుణపై దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. ఈదాడిలో సుగుణ చాతి, మెడ బాగాలలో గాయాలయ్యాయని ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు.బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల కళాశాల విద్యార్థుల ఉత్తీర్ణత

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్25: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో విద్యార్థి నిలు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పి.సవిత తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పి.రుచిత 974, బైపీసీలో ఎ.పూజశ్రీ 885 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.రజిత 448, బైపీసీలో డి.గాయత్రి 424మార్కులు సాధించగా కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.



కుస్తీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతకుంటలో కుస్తీపోటీలు

మోర్తాడ్,ఏప్రిల్25: మండలంలోని చింతకుంట గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం కుస్తీ పోటీలు నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతారెడ్డి ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహరాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుండి మల్లయోధులు వచ్చి పోటీలో తలపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై స్టేట్ సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ చేస్తున్న ఈజీఎస్ స్టేట్ బృందం

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 25: నిజామాబాద్ రూరల్ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రూరల్ ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, ఎంపీవో మదురిమ సమక్షంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, విజిలెన్స్ అధికారి నారాయణ,అంబుడ్స్‌మెన్ అధికారి శ్రీనివాసరావులతో కూడిన ఎంజీఎన్ ఆర్‌జీఎస్ బృందం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ కూలీల వివరాలు, పనుల వివరాల్లోని లోపాలను ప్రశ్నించారు. సిబ్బంది తయారుచేసిన రికార్డులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల హాజరును తీసుకోకుండానే పనులు నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు సైతం పూర్తి వివరాలను నివేదికలో రూపొందించలదేని ప్రశ్నించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీల భద్రతను కూడా పట్టించుకోలేదని, మౌళిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవో మల్లేష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, ఎంపీవో మధురిమ, టీఏలు జోగేందర్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, ఉమ,తదితరులు పాల్గొన్నారు.

విజయ్ విద్యాసంస్థల అధినేత కాంగ్రెస్‌లో చేరిక

మాక్లూర్, ఏప్రిల్25:విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, విద్యాసంస్థల అధినేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులై తాను పార్టీలో చేరానని ఆయన అన్నారు.

అంబంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం

ఎడపల్లి, ఏప్రిల్ 25: ఎడపల్లి మండలంలోని అంబం గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలను గురువారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లి వార్షికోత్సవానికి వచ్చిర భుక్తలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిస్క గంగాప్రసాద్, ముదిరాజ్ సంఘ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ప్రతి కూలీకి 2వందల రోజుల పనికల్పించాలి

● ప్రగతిశీల రైతు సంఘం నాయకుల డిమాండ్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 25: ఉపాధిహామీ పథకంలో అర్హులైన వారందరికి జాబ్‌కార్డులు జారీచేస్తూ ప్రతీ కూలీలకు రెండువందల రోజుల పనికల్పించాలని అఖిలబారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, నాయకులు కిషన్ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కోనాసముందర్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధీహామీ పథకం పనుల చోట్ల ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి కూలీలకు కల్పిస్తూన్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పథకం ప్రారంభసమయంలో ఇచ్చిన జాబ్ కార్డులే తప్ప ఇప్పటివరకు ఇచ్చిన దాఖలాలు లేవని, కుటుంబాలు పెరుగుతున్నా జాబ్‌కార్డులు పెరగడంలేదని ఆరోపిస్తూ అర్హులైన కూలీలందరికి జాబ్‌యకార్డులు అందజేయాలని, వారంవారం కూలీడబ్బులు చెల్లించాలని, రెండువందల రోజులకు తగ్గకుండా పనికల్పిస్తూ కనీసం రూ.600 కూలీ గిట్టుబాటు ఆయ్యేలా చూడాలని,పని ప్రదేశంలో కూలీలకు నీడ,తాగునీటి సదుపాయాలు కల్పించాలని, ప్రథమచికిత్సనిమిత్తం కిట్లు అందుబాటులో ఉంచాలని, కూలీలకు పదిలక్షల ఇన్సూరెన్స్ అమలుపర్చాలని, వృద్ధ కూలీలకు రూ.5వేల జీవన బృతి కల్పించాలని, ఫీల్డ్‌అసిస్టెంట్‌కు రూ.20 వేల జీతాలు ఇస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, మెట్లకు 10వేల జీతం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల డిమాండ్ల సాధనకై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

'పోలీసుల నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడు'

సిరికొండ ఏప్రిల్ 25: తన భర్త మరణానికి కారకులైన ఐదుగురు వ్యక్తుల అరెస్టు చేసే దాక తాను శవాన్ని ఇక్కడి నుంచి కదిలించేది లేదని గుర్రాల రవీందర్ భార్య శ్యామల శవాన్ని మల్కీ లతా ఇంటి ముందు వుంచి ఆందోళన చేశారు. సుమారు నాలుగు గంటల పాటు శవాన్ని మల్కీ లతా ఇంటి ముందర ఉంచి నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లె తన భర్త రవీందర్ చనిపోయాడని శ్యామల ఆరోపించింది. రెండు సార్లు తన భర్తను లతా తన అన్నదమ్ములు ఒక సారి ఇంట్లో నిద్రిస్తుండగా మరోక సారి కమ్యూనిస్టులమని చెప్పుకునే వ్యక్తుల అండదండలతో చితగ్గొట్టారని ఈ విషయంలో పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేసిన పెద్దగా స్పందించక పోవడం వల్లే ఆత్మహత్యా చేసుకున్నాడని శ్యామల ఆరోపించారు. భర్త ఆత్మహత్యాకు కారకులైన వారిని అరెస్టు చేసేదాక తాను ఆందోళ విరమించేది లేదని శ్యామల పోలీస్‌లకు తేల్చి చెప్పారు.డిచ్‌పల్లి సీఐ మల్లేశం, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పిన వారు వినిపించుకోలేదు. న్యాయం చేస్తామని ఏసీపీ చెప్పిన శ్యామల మాత్రం ఏమి న్యాయం చేస్తారు తన భర్తే చనిపోయాడు ఇంకేమి న్యాయం చేస్తారు, మీరు న్యాయం చేస్తామంటే మేము నమ్మాలా అని శ్యామ అధికారులను ప్రశ్నించడంతో వారు తేరు కోలేక పోయారు. తాము చెప్పిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేస్తేనే తాను తన భర్త అంత్యాక్రియలు చేయడానికి ఒప్పుకుంటానని చెప్పడంతో ఏసీపీ రాజవెంకటరెడ్డి మీ కుటుంబానికి న్యాయం చేస్తాను నన్ను నమ్మాలని సూచించడంతో ఆమె కాస్త మెత్తబడింది. ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామని మిగిలిన ముగ్గురిని అరెస్టు చేస్తామని ఏసీపీ చెప్పడంతో శ్యామల, ఆమె బంధువులు కుటుంబ సభ్యులు రవీందర్ అంత్యాక్రియలు చేయడానికి అంగీకరించారు.శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశం చెప్పారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటలను జరుగకుండా డీచ్‌పల్లి సీఐ మల్లేశం, సిరికొండ ఎస్సై రమేష్ బందో బస్తు నిర్వహించారు.



నిందితురాలి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం



కుస్తీ పడుతున్న మల్లయోధులు

బీర్కూర్‌లో ఘనంగా కుస్తీ పోటీలు

బీర్కూర్, ఏప్రిల్ 25: బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రతీఏటా హనుమాన్ జయంతి సందర్భంగా గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. గురువారం కుస్తీ పోటీలు నిర్వహించగా వేలాది మంది ప్రజలు పోటీలను తిలకించేందుకు తరలివచ్చారు. ఇదిలా ఉండగా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీల్లో తలపడ్డారు. గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు.



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయశాఖాధికారి

దళారులను నమ్మి మోసపోవద్దు

బిచ్కుంద, ఏప్రిల్ 25: రైతులు కష్టపడి పండించిన జొన్న పంటను దళారులను నమ్మిమోసపోవద్దని మండల వ్యవసాయాధికారి రాజలింగం అన్నారు. గురువారం బిచ్కుంద, పుల్కల్ సొసైటీల ఆధ్వర్యంలో రూ.3180 మద్దతు ధరతో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జొన్నలు రైతుల వద్ద నుంచి ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సౌమ్య, సాయికిషోర్, సంపత్, బిచ్కుంద సొసైటీ కార్యదర్శి శ్రావణ్, పుల్కల్ సొసైటీ కార్యదర్శి సాయి ప్రకాష్ గ్రామపెద్దలు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన సుభాష్

పిట్లం, ఏప్రిల్ 25: అకోలా-సంగారెడ్డి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి డీసీఎం బైక్‌ను ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న సుభాష్(25) తలకు తీవ్రంగా గాయాలుకావంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై నీరేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా, వట్‌పల్లి మండలం బుత్కుర్ గ్రామానికి చెందిన బెగరి సుభాష్ బైక్‌పై పిట్లం నుంచి 161 జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళ్తుండగా, సంగారెడ్డి నుంచి పిట్లం వైపు వస్తున్న డీసీఎం పిట్లం సమీపంలో గద్దగుండు తండా వద్ద మితిమీరిన వేగంతో వచ్చిన డీసీఎం బైక్ ఢీకొట్టడంతో సుభాష్ అనే వ్యక్తి అక్కడే మృతి చెందడం జరిగిందన్నారు. మృతుడు పని నిమిత్తం పెయింటింగ్ పని చేస్తాడని, మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



బేతాళస్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా బేతాళస్వామి జాతర సంబరాలు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 25: బాన్సువాడ పట్టణంలో బేతాళస్వామి జాతర సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు బేతాళస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో వివిధ రకాలైన దుకాణాలు వెలిశాయి. సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ప్రజలు తరలిరావడంతో జాతరలో సందడిగా సాగింది. జాతరకు విచ్చేసిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని విధాల ఏర్పాట్లు చేశారు. గ్రామపెద్దలు బేతాళస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, జాతర కమిటీ సభ్యులు తదితరులున్నారు.

నేడు కుస్తీ పోటీలు

ప్రతీయేటా నిర్వహించే బేతాళస్వామి జాతర రెండవ రోజున బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కుస్తీ పోటీలు జరుగుతాయి. శుక్రవారం జరిగే కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి మల్లయోధులు విచ్చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళా మల్లయోధులు కూడా పాల్గొంటారన్నారు.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 25 : ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రవల్లిక(15) బుధవారం కిరాణం దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా గాని ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

భిక్కనూరు, ఏప్రిల్ 25: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవడంతో దోమల వ్యాప్తిని నివారించవచ్చని భిక్కనూరు మండల వైద్యాధికారిణి హేమిమా అన్నారు. గురువారం భిక్కనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మాట్లాడుతూ మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తత ముఖ్యమని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని, నిత్యం మురికి కాలువలను శుభ్రం చేయాలని, రాత్రి దోమ తెరలను ఉపయోగించాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సినిమా టాకీ సుచౌరస్తా వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా జిల్లాలో ర్యాలీలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. దోమలు కుట్టడం వల్ల వచ్చే జబ్బులు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గిరీష్, సీహెచ్‌వో రవీందర్, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: దోమకాటు వల్ల వస్తున్న మలేరియాను నివారించడానికి కలిసి కట్టుగా కృషి చేయాలని డోంగ్లీ వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా డోంగ్లీ పీహెచ్‌సీ పరిధిలోని మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా వస్తుందని శాస్త్రవేత్తలు పరిశోధన ద్వారా తెలిపారన్నారు. వాంతులు, రోజు విడిచి రోజు జ్వరం, తల నొప్పి లక్షణాలన్నారు. పరిశుభ్రత వల్ల దోమలను నివారించవచ్చన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రామారెడ్డి పీహెచ్‌ఎస్ వైద్యుడు సురేష్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల చుట్టు పక్కల నిల్వ ఉన్న నీటిపైన మూతలు ఉంచాలని, మురికి కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమతెరలు వాడి దోమకాటుకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్ వైజర్ భీమ్, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రామారెడ్డిలో..



డోంగ్లీలో..

మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నం

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 25: కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి అమలు చేయడంలో విఫలమైందని, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, జనార్దన్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ర్యాలీ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని రామాలయం నుంచి బస్టాండ్ వరకు కొనసాగింది. బస్టాండ్ వద్ద పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నిటినీ అమలు చేస్తామని చెప్పి, నాలుగు నెలలు అవుతున్నా హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆగస్టు 15 లోపు రెండు లక్షల రూపాయలు రైతు రుణమాఫీ చేస్తామంటూ మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. రైతు భరోసా, 4 వేల రూపాయల పెన్షన్, వరికి రూ.500 బోనస్, మహిళలకు 2,500 భృతి ఏమైందని ఆయన ప్రశ్నించారు. వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. జహీరాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు ప్రజలకు తెలిసాయని, ప్రజలు అప్రమత్తమయ్యారని, ప్రస్తుతం ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, జనార్దన్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపు బాధ్యత కార్యకర్తలదే'

గాంధారి, ఏప్రిల్ 25: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు బాధ్యత కార్యకర్తలదేనని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం గాంధారి మండల కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాదులని ప్రతీ కార్యకర్త కష్టంతోనే నాయకులు గెలుస్తారని ఆయన అన్నారు. కార్యకర్తల కృషితోనే ఎంపీలు, ఎమ్మెల్యేల అవుతున్నామని సూచించారు. జహీరాబాద్ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గడపగడపకు వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని కార్యకర్తలు కోరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, పోతంగల్ కిషన్‌రావు, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, బీజేపీ మండల అధ్యక్షుడు మదుసూదన్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

గాంధారి,ఏప్రిల్ 25: ఈనెల 27న కోత్తగుడెంలో జరిగే పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. గురువారం అందుకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, విద్యారంగంలోని ఇబ్బందులపై నిరాంతరం పీడీఎస్‌యూ పోరాడుతుందని తెలిపారు.విద్యకాషాయికరణ కార్పోరేటికరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యాక్షుడు మోజీరాం,నాయకులు తారచంద్, లక్ష్మన్, సంతోష్, శ్రీనివాస్, ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పలువురి చేరిక

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 25: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ కౌన్సిలర్ విజయలక్ష్మీ, సాతెల్లి మాజీ సర్పంచ్ సంగయ్య, మున్సిపల్ కోఆప్షన్ షరీఫ్‌లకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, చెన్న లక్ష్మణ్, గయాజుద్దీన్, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, గఫర్, తిరుపతి, హజార్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

బీబీపేట, ఏప్రిల్ 25: బీబీపేట సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి బుధవారం ఉమ్మడి నిజామాబాద్ డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

'మతోన్మాద బీజేపీని గద్దెదించాలి'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 25: దేశంలో ప్రజావ్యతిరేక పార్టీ అయిన బీజేపీ పార్టీని, మోదీని గద్దెదించాలని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సీపీఎం పార్టీ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చిందని తెలిపారు.పదేండ్ల కాలంలో దేశంలోని రైతులు, ప్రజలు, కార్మికులు, వృత్తిదారుల వ్యతిరేక విధానాలను అవలంబించిందని అన్నారు. పెట్టుబడిదారుల యొక్క ఆస్తులు పెరగడం కోసం దాని విధానాలను మార్చుకుందని అన్నారు. సమావేశంలో నాయకులు మోతిరాం నాయక్, ఖలీల్, చంద్రశేఖర్, అరుణ్,రాజనర్సు, భాస్కర్, సావిత్రి, సాయిలు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మొబైల్ ఫోన్ల అందజేత

దోమకొండ, ఏప్రిల్ 25: దోమకొండ పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న ఇద్దరు బాధితులకు ఎస్ఐ అందించారు. చింపలా బుచ్చవ్వకు చెందిన సెల్‌ఫోన్ ఈనెల 2న కోనాపూర్‌లో పోగొట్టుకుందని,బద్దం దుర్గారెడ్డి ఫిబ్రవరి 23న దోమకొండలో పోగొట్టుకున్నాడని తెలిపారు. వారి ఇరువురికి గురువారం సీఈఐఆర్‌ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీసుస్టేషన్‌లో సంప్రదిస్తే సీఈఐఆర్ ద్వారా కనిపెట్టి అందిస్తామని తెలిపారు.

17మంది బైండోవర్

భిక్కనూరు, ఏప్రిల్ 25: మండలానికి చెందిన 17మందిని తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట గురువారం పోలీసులు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా భిక్కనూరు సీఐ సంపత్ మాట్లాడుతూ.. బైండోవర్ పూర్తి అయిన పాత నేరస్థులతో పాటుగా, ఇటీవల ఆర్థిక పరమైన నేరాలకు పాల్పడిన, ఎన్నికల్లో గొడవలకు పాల్పడేవారు 17మందిని తహసీల్దార్ ఎదుట ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బైండోవర్ చేయ్యడం జరిగిందన్నారు. బైండోవరైనా వ్యక్తులు ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కార్యకర్తలే నాయకులను తయారు చేస్తారు

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

లింగంపేట, ఏప్రిల్ 25: కార్యకర్తలే నాయకులను తయారు చేస్తారని, కార్యకర్తలు కష్టపడితేనే నాయకులు అవుతారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండల కేంద్రంలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసి బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్‌తోనే పోటీ అని ఆయన తెలిపారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికి తిరిగి ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశానికి చేస్తున్న సేవలు, సంక్షేమపథకాలను వివరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందన్నారు. జహిరాబాద్ పార్లమెంట్ గడ్డపై బీజేపీ కాషాయపు జెండాను ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒక్కో బూత్ నుంచి 300ఓట్లు వచ్చే విధంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచించారు. కష్టపడ్డ వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని విధాల ఆదుకుంటామని అండగా ఉంటామని అన్నారు. కార్యకర్తలు భయభ్రాంతులకు గురికావద్దని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. అన్ని గ్రామాలలో ప్రచారాన్ని వేగవంతం చేయాలన్నారు. జహిరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ నుంచి పోటీచేస్తున్న బీబీ పాటిల్‌కు లింగంపేట మండలం అన్ని మండలాల కంటే లీడ్ ఇవ్వాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు భాణాల లక్ష్మారెడ్డి, మాజి మంత్రి నేరేళ్ళ అంజనేయులు, పైల కృష్ణారెడ్డి, బాపురెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దత్తురాంలు, మురళి, తల్వార్, బొల్లారం సాయిలు మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన

దోమకొండ, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని చాముండేశ్వరి దేవాలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈనెల 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఈవో ప్రభు, చైర్మన్ శేఖర్ తెలిపారు.ఇందులో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో అష్టోత్తర కలశ మహా కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా 26 న సామూహిక సత్యనారాయణ వ్రతం, 27న సంకష్టహర గణపతి 8వ వార్షికోత్సవం, 28న సిద్ధి, బుద్ధిసమేత సంకష్టగణపతి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

చేపల పెంపకానికి రైతులు ముందుకు రావాలి

● జడ్పీ సీఈవో చందర్ నాయక్



బీర్కూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

బీర్కూర్, ఏప్రిల్ 25: చేపల పెంపకానికి రైతులు ముందుకు రావాలని జడ్పీ సీఈవో చందర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో పర్యటించారు. తిమ్మాపూర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫిష్ పాండ్‌ను ఆయన పరిశీలించారు. ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం చేపల పెంపకానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. ఈ విషయమై ఐకేపీ సిబ్బంది అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చేపల పెంపకం కోసం పీఎంఈజీపీ ద్వారా 35 శాతం సబ్సిడీపై బ్యాంకు రుణం లభిస్తుందని ఆయన చెప్పారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఐకేపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీఎం, సీసీలతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. మహిళలకు స్కూల్ యూనిఫాంలు కుట్టడం, చేపల పెంపకం, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భారతి, ఏపీఎం గంగాధర్, ఏపీవో అక్మల్, సీసీలు, టీఏలు, తిమ్మాపూర్ జీపీ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	మనజుమిల్ బాయ్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర	పారిజాత పర్వం

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210